ఆస్పత్రిలో సిబ్బంది కొరత

- వ్యాధులకాలంలో ప్రజలపై ప్రభావం
- ప్రైవేటును ఆశ్రయిస్తున్న గిరిజనులు
- పట్టింపులేని అధికార యంత్రాంగం



దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం..

దుమ్ముగూడెం: భద్రాచలం డివిజన్‌లోనే అతి పెద్ద మండలమైన దుమ్ముగూడెం మండల ప్రజలకు మెరుగైన వైద్యం ఇంకా అందని ద్రాక్షగానే మిగులుతోంది. వ్యాధుల కాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలు నిత్యం వివిధ రకాల వ్యాధులతో వైద్యశాలలకు వస్తుంటారు. ఈ క్రమంలో సరిపడా సిబ్బంది లేక పోవడంతో రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదు.

మండలంలో 24గంటలు పని చేసే దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, 12 గంటలు పనిచేసే నర్సాపురం, పర్ణశాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు ఉన్నాయి. కాగా 24 గంటల వైద్యశాలలో ఇద్దరు వైద్యులు ఉండాల్సి ఉంది. కానీ ఇక్కడ విధులు నిర్వర్తించే డాక్టర్ పుల్లారెడ్డి గత కొన్ని రోజులుగా డిప్యూటేషన్‌పై క్షయవ్యాధి జిల్లా ప్రోగామ్ అధికారిగా వెళ్లారు. ప్రస్తుతం ఇక్కడ డాక్టర్ రుక్మాకర్ రెడ్డి ఒక్కరే విధులు నిర్వర్తిస్తున్నారు.

డాక్టర్ ఒక్కరు.. విధులు బారెడు

ప్రస్తుతం డాక్టర్ రుక్మాకర్ రెడ్డి ఒక్కరే విధులు నిర్వర్తిస్తుండగా.. అన్ని విధులూ నిర్వర్తిచడం సాధ్యపడడంలేదు. వైద్యశాల పరిధిలోని గ్రామాల్లో నిర్వహించే హెల్త్‌క్యాంపులకు, డ్రైడే ఫ్రైడే కార్యక్రమాలకు ఆయన వెళ్తే ఆస్పత్రిలో వైద్యుడి సీటు ఖాళీగా ఉంటోంది. అదే సమయంలో అత్యవసర చికిత్సకు వస్తున్న రోగులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మండలంలో గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలలు 8 ఉన్నాయి. అందులో చదివే పిల్లలు అనారోగ్యం బారిన పడితే మండల కేంద్రంలోని వైద్యశాలకు చికిత్స కోసం వస్తుంటారు. అంతేకాక ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి సరిహద్దు మండలం కావడంతో అటవీప్రాంతం గ్రామాల ప్రజలు కూడా వైద్య సేవల కోసం వస్తుంటారు. దీనికితోడు ఏజెన్సీలో రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యల ఘటనలు చోటు చేసుకుంటే సత్వర వైద్య సేవలు అందించాల్సి ఉంటుంది. ఇలాంటి సమయాల్లో ఒక్కరే విధులు నెట్టుకురావడం సాధ్యం కాదు.

ఇంకో వైద్యుడు తప్పనిసరి

ఒక్కడే వైద్యుడితో అతిపెద్ద మండలమైన దుమ్ముగూడెంలో పూర్తి స్థాయిలో సేవలు అందడం లేదు. ఇటువంటి సమయంలో మరో డాక్టర్ అవసరం తప్పనిసరి. గతంలో ఎంపీహెచ్ డాక్టర్ అందుబాటులో ఉండే వాడు. ఆ సమయంలో గ్రామాల్లో హెల్త్‌క్యాంపులకు ఎంసీహెచ్ వైద్యుడు హాజరైతే.. వైద్యశాలలో మరో డాక్టర్ అందుబాటులో ఉండటంతో ఇబ్బందులు తలెత్తేవి కావు. కానీ ఎంసీహెచ్ వైద్యుడిని సైతం చర్లకు డిప్యూటేషన్‌పై పంపడంతో అతని సేవలు కూడా అందడం లేదు. నిత్యం 100కు పైగా అవుట్ పేషెంట్లు, డెలివరీ కేసులు వస్తున్న దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మరో వైద్యుడు తప్పనిసరి.

నియామకం చేపట్టాల్సిన పోస్టులు ఇవే..

వైద్యుడి లేదా ఎంసీహెచ్ మెడికల్ ఆఫీసర్ స్థానంతోపాటు దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అనేక పోస్టులు ఖాళీగా ఉన్నారు. మెడికల్ ఆఫీసర్, స్టాఫ్ నర్సులు-2, ల్యాబ్ టెక్నీషియన్-1, పర్ణశాలలో హెల్త్ అసిస్టెంట్, చిన్ననల్లబల్లి, కాశీనగరం సబ్ సెంటర్‌లలో ఏఎన్‌ఎంల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నర్సాపురం ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్-1, మేల్ సూపర్ వైజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సీజనల్ వ్యాధులు ప్రబలే ఈ కాలంలో వైద్య సిబ్బంది కొరత ఉండటం వల్ల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందడం లేదు. దుమ్ముగూడెం, నర్సాపురం వైద్యశాలలో రోగా నిర్ధారణ చేసే ల్యాబ్ టెక్నీషియన్ నియామకం చేపట్ట లేదు. రోగాల భారీన పడిన ప్రజలు రోగా నిర్ధారణ చేసు కోవడానికి ప్రైవేట్ ల్యాబ్లను ఆశ్రయించి జేబులను గుల్ల చేసుకుంటున్నారు.

ఏజెన్సీ వైద్యంపై చిన్న చూపు..



ఏజెన్సీ వైద్యంపై అధికారులు చిన్న చూపుచూస్తున్నారు. ఆరోగ్యకేంద్రాల్లో సరిపడా సిబ్బంది నియమాకాలు చేపట్టకుండా అరకొర సిబ్బందితో నడిపించడం ఏజెన్సీ వాసులకు వైద్యం అందిచడంలో తీవ్ర నిర్లక్ష్యం ఉన్నట్టే. తక్షణమే జిల్లా అధికారులు సిబ్బంది నియామకం చేపట్టి వర్షాకాలంలో మెరుగైన సేవలు అందించాలి.

– సోయం కామరాజు, ఏఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

అభివృద్ధి పథంలో పినపాక

పినపాక: పినపాక మండలం అభివృద్ధి పథంలో నడుస్తోందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం మండలంలో పర్యటించిన ఆయన.. 17 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అభివృద్ధి ఫలాలు మండలంలో ప్రతి ఒక్క లబ్ధిదారులకు అందుతాయని, ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అనంతరం ఐలాపురం డబల్ బెడ్ రూమ్ కాలనీవాసులు తమకు అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. బయ్యారం గ్రామంలో కంది పెద్ద వెంకటరెడ్డి అనారోగ్యంతో మృతిచెందగా వారికి నివాళులర్పించారు. మండల అధ్యక్షుడు రామనాథం నాయకులు పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: మండలంలోని సమితి సింగారం పంచాయతీలోని గుట్టమల్లారం పంచాయతీలో రూ.కోటి వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భూమిపూజ చేశారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు పోతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, డీటీ రామారావు, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వర్లు, ఏఈఓ లక్ష్మణరావు, మండల కాంగ్రెస్ నాయకులు నవీన్, శివ సైదులు, గాండ్ల సురేశ్, సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.


పినపాక: సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

హాస్టల్‌లో ఏఎస్‌డబ్ల్యూఓ సందర్శన

ములకలపల్లి: మండలకేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ (ఏఎస్‌డబ్ల్యూఓ) కె.హనుమంతరావు ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. మెనూ అమలు చేస్తున్న తీరును పరిశీలించారు. రికార్డులను పరిశీలించి, సంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రభుత్వం ద్వారా మంజూరైన నోటు పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యపై దృష్టి సారించాలని విద్యార్థులకు తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సిబ్బంది ఆదేశించారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ అంతోటి శ్రీధర్ ఉన్నారు.


నోట్‌బుక్స్ అందజేస్తున్న హనుమంతరావు

అమ్మవారికి ఆషాఢ సారె


దమ్మపేట: అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పిస్తున్న ఆర్యవైశ్య మహిళలు

దమ్మపేట: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఉన్న కనకదుర్గమ్మ, వాసవి మాతలకు దమ్మపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆషాఢ మాసం సారెను అందజేశారు. ఆదివారం ఆషాడ మాసం, తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారిని శాకాంబరిగా అలంకరించారు. దమ్మపేట ప్రధాన సెంటరు నుంచి అయ్యప్ప స్వామి ఆలయం వరకు మేళతాళాలతో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆషాడ మాస కావిడితో ఊరేగింపుగా వచ్చారు. ఆలయంలో ఆర్యవైశ్య మహిళలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి, సారెను అమ్మవార్లకు సమర్పించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు దారా యుగంధర్, దారా మల్లిఖార్జునరావు, అత్యం వెంకటేశ్వరరావు, పసుమర్తి రాంభద్రం, దారా ప్రసాద్, చారుగుండ్ల ప్రదీప్, సురేష్, సత్తిపండు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

దమ్మపేట గ్రామ శివారులోని శ్రీముత్యాలమ్మ తల్లికి ఆదివారం తొలి ఏకాదశిని పురస్కరించుకుని, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక మార్కెట్ యార్డ్ వీధికి చెందిన పలు సామాజిక వర్గాల స్థానికులు మేళతాళాలతో, నృత్యాలు చేస్తూ.. ఆలయం వరకు ఊరేగింపుగా తరలివెళ్లారు. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి, ప్రత్యేక నైవేద్యం సమర్పించారు. మహిళలు అమ్మవారికి చీర, సారెలతో ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు.

తీర్థయాత్రలకు ప్రత్యేక బస్సులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 12 రాత్రి 9 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరి యాదగిరిగుట్ట స్వర్ణగిరి కొలను పాకం దేవాలయాల దర్శనం చేయించి తిరిగి శనివారం రాత్రి 9 గంటలకు భద్రాచలం చేరుకుంటుందని డిపో మేనేజర్ తిరుపతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బస్సు టికెట్ ధర పెద్దలకు రూ.1250, పిల్లలకు రూ.750 చొప్పున చెల్లించాలని పేర్కొన్నారు. అదే విధంగా మరో సూపర్ లగ్జరీ బస్సు అన్నవరం, వాడపల్లి ద్వారకా తిరుమల, మద్ది ఆంజనేయస్వామి దేవాలయాల దర్శనం చేయించుకుని శనివారం రాత్రి 9 గంటలకు భద్రాచలం చేరుకుంటుందని తెలిపారు. ఈ బస్సు టికెట్ ధర పెద్దలకు రూ.1400లు, పిల్లలకు రూ.750లు ఉంటుందని తెలిపారు. అలాగే 30 మంది ఓ గ్రూపుగా ఉండి అభ్యర్థిస్తే.. వారు కోరుకున్న యాత్ర స్థలాలకు, విహారయాత్రలకు బస్సు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మరిన్ని వివరములకు 9390612253, 9063414561, 9959225987 ఈ నంబర్లకు సంప్రదించాలని ఆయన సూచించారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

బూర్గంపాడు: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఏఐటీయూసీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సింగంనేని ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం సారపాకలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తు ఈ నెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో స్వామిగౌడ్, కృష్ణమూర్తి, పారుపల్లి శ్రీనివాస్,సింగంనేని సురేష్, పోతుగుంట్ల వెంకట్, షేక్ హుజుర్, బల్లెం నాగయ్య, రాయల నవీన్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం, కాంగ్రెస్, ఎంఎల్(ప్రజాపంథా) పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సారపాకలో జరిగిన సమావేశంలో పార్టీల నాయకులు మాటాడారు. సమావేశంలో పార్టీల నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, పూలపెల్లి సుధాకర్‌రెడ్డి, మల్సూర్, కనకం వెంకటేశ్, ఎస్‌కె.అబీదా తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: ఈ నెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీపార్టీ జిల్లా నాయకులు ఎస్‌కె.ఉమర్ ఆదివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. కార్మికులు, కర్షకులు, వ్యాపారులు, విద్యార్థులు అందరూ ఈ ఆందోళనలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ ప్రకటన విడుదల చేసిన వారిలో ఆ పార్టీ నాయకులు వరికూటి వెంకట్రావ్, టి.భీముడు, బాలు, జి.వెంకటేశ్వర్లు, రవి ఉన్నారు.

చర్ల: ఈ నెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం చర్లలోని గణేష్ ఆటో యూనియన్ ఆటో అడ్డాలో సీఐటీయూ ఆటో వర్కర్స్ యూనియన్ చర్ల మండల అధ్యక్షుడు పామారు బాలాజీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. మండలంలో ఆటోలను పూర్తిగా నిలిపివేసి ప్రతీ ఆటో కార్మికుడు సమ్మెలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ మండల కార్యదర్శి ధనసరి సంపత్, నాయకులు కంచర్ల సతీష్, అశోక్, విజయ్, నాగరాజు, హరిబాబు, తులసి, సంతు, మున్నా తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: కార్మిక చట్టాల పరిరక్షణ కోసం సమ్మెలో పాల్గొనాలని టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి నూపా భాస్కర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో వామపక్ష పార్టీలు, అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఈనెల 9వ తేదీన జరుపతలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎండి.యూసఫ్, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు నరాటి రమేశ్, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్‌కార్యదర్శి పోతుగంటి లక్ష్మణ్, ఏఐవైఎఫ్ నాయకులు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



బూర్గంపాడు: సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

ట్రిపుల్ ఐటీలో సీటు

మణుగూరురూరల్: మండలంలోని గుట్టమల్లారంలో ఉన్న శ్రీవిజ్ఞాన్ స్కూల్ విద్యార్థి మేడ భానుప్రసాద్ ట్రిపుల్ ఐటీ-మహబూబ్‌నగర్ (బాసర-ఆర్‌జీయూకేటీ)లో సీటు సాధించాడు. విద్యార్థి భానుప్రసాద్ పదో తరగతి పరీక్షల్లో సైతం 580 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంక్ కైవసం చేసుకున్నాడు. ఆదివారం పాఠశాలలో కరస్పాండెంట్ సప్పిడి సాంబశివ రెడ్డి.. సీటు సాధించిన విద్యార్థి భానుప్రసాద్, ప్రోత్సహించిన తల్లిండ్రులు, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రత్నకుమార్, ఉపాధ్యాయులు దుర్గాదేవి, ధనలక్ష్మి, రజిత తదితరులు పాల్గొన్నారు.

ఉచిత షుగర్ పరీక్ష శిబిరం

మణుగూరుటౌన్: పట్టణంలో లయన్స్ క్లబ్ మణుగూరు ఆధ్వర్యంలో ఆదివారం షుగర్, బీపీ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ లయన్ డాక్టర్ షేక్ మీరా హుస్సేన్ అధ్యక్షతన కార్యక్రమం ప్రారంభించి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం షుగర్, బీపీ నిర్ధారణ నిర్వహించనున్నట్లు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ శ్రీనివాస్, అడబాల నాగేశ్వరరావు, టెక్నీషియన్ శేరు రవి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ అందేలా చర్యలు తీసుకోవాలి

చర్ల: ప్రతీ దివ్యాంగుడికి సదరన్ సర్టిఫికెట్ అందేలా అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వికలాంగుల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం చర్లలో సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చర్ల మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వికలాంగుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా రేగళ్ల సుధాకర్, ఉపాధ్యక్షుడిగా ఈ.ప్రసాద్, కార్యదర్శిగా బి.సాగర్, సహాయ కార్యదర్శిగా జి.సురేష్‌రెడ్డి, కోశాధికారిగా శెట్టి సుబ్రహ్మణ్యం కార్యవర్గ సభ్యులుగా సంతపురి సతీష్, పూనెం నానమ్మ, కుంజా కమల, కేశవులు, శంకరాచారిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు రేగళ్ల సుధాకర్ మాట్లాడుతూ.. దివ్యాంగులను గుర్తించి వారికి సదరన్ క్యాంపు వివరాలను తెలియజేయడంతో పాటు అధికారులే వారిని క్యాంపుకు తరలించి సర్టిఫికెట్ ఇప్పించాలని కోరారు. సమావేశంలో మండలానికి చెందిన పలువురు వికలాంగులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కరకగూడెం: మండలంలోని రాళ్లవాగు పెద్దమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఆదివారం మండలంలోనే ఆటో డ్రైవర్ల సమావేశం నిర్వహించుకొని ఓటింగ్ పద్ధతి ద్వారా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆటో యూనియన్ అధ్యక్షుడిగా తాటిగూడెం గ్రామానికి చెందిన కొమరం సాంబశివరావు, ఉపాధ్యక్షుడిగా నిట్టా సౌందర్యరావు, ప్రధాన కార్యదర్శిగా గుడ్ల రంజిత్, కోశాధికారిగా సాధనపల్లి లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శి యజ్జ సాయికుమార్, సలహాదారు గుమ్మడి వెల్లి శ్రీనును ఎన్నుకున్నారు. అలాగే కమిటీ సభ్యులుగా నర్సింహులు, సాంబ, కుమార్, సుకుమార్ ఎన్నుకయ్యారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాలను సందర్శించిన ఆంధ్రా ఎమ్మెల్యే


పూజలు చేస్తున్న దెందలూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): ఏపీ రాష్ట్రంలోని దెందలూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దంపతులు ఆదివారం మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలోని దేవాలయాన్ని సందర్శించారు. భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి, బాలాజీ వెంకటేశ్వరస్వామి దేవాలయాలను సందర్శించి స్వామివారి సన్నిధిలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు వారికి ప్రత్యేకంగా ఆహ్వానం అందించారు.

వైద్యఖర్చులకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

మణుగూరురూరల్: మండల పరిధిలోని చిక్కుడుగుంట గ్రామానికి చెందిన గుండారపు రాంబాబు- మీనాక్షి దంపతుల మూడేళ్ల కుమారుడు నరసింహ గుండెకు రంధ్రం పడడంతో తీవ్రంగా బాధపడుతుండగా.. శస్త్రచికిత్సల కోసం మణుగూరు జనం కోసం మనం స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. రూ.15వేలను బాలుడి తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు బండారు సురేష్, తంతరపల్లి శోభన్, కొండేరు మహేందర్, గుంటక శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంక్‌కు వ్యతిరేకంగా వంటావార్పు

దమ్మపేట: దమ్మపేట బస్టాండ్‌లో పెట్రోల్ బంక్ నిర్మాణాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తూ, స్థానికులు వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. రిలే నిరాహార దీక్ష, నిరసన కార్యక్రమాలను ఏడో రోజు అయిన ఆదివారం కూడా కొనసాగగా.. ఇందులో భాగంగా బస్టాండ్ ప్రాంగణంలోనే వంటలు చేసి నిరసన తెలిపారు. బంక్ నిర్మాణాన్ని పూర్తిగా ఆపేంత వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సున్నం శ్రీను, తంబళ్ల రవి, చవ్వా పోలరావు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి

మణుగూరురూరల్: మండలంలోని పరిధిలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యంపై, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. వర్షాకాల నేపథ్యంలో గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, పిచ్చిమొక్కలను తొలగించాలని, సైడ్ కాలువలను శుభ్రం చేయించాలని డిమాండ్ చేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా దోమల నివారణ చర్యలు చే పట్టాలని, నిత్యం ఫాగింగ్ నిర్వహించాలన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాలమాటి పూర్ణచందర్‌రావు, నాయకులు మల్లిడి లోకేష్, యార్లగడ్డ రాజా, పాల్వాయి సుధాకర్, సుమేష్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశువైద్యశాల భవనం


శిథిలమై కనిపిస్తున్న పశువైద్యశాల


పెచ్చులుగా ఊడిపోయి ఉన్న స్లాబు

- పెచ్చులూడుతున్న స్లాబు
- వర్షాకాలం దయనీయం
- నూతన బిల్డింగ్ నిర్మించాలని రైతుల డిమాండ్

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలంలోని ఎర్రగుంట (పెద్దిరెడ్డిగూడెం) గ్రామంలో ఉన్న పశు వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. ఫలితంగా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది భయం భయంగా గుడుపుతున్నారు. నాలుగు దశాబ్దాలక్రితం నిర్మించిన ఈ భవనం అప్పుడే శిథిలమైంది. స్లాబు భాగం పెచ్చులు పెచ్చులుగా ఊడిపడుతోంది. చిన్నపాటి వర్షం వచ్చినా స్లాబు కురుస్తుంది. దీంతో రికార్డులు, పశువుల మందులు సైతం తడిచిపోతున్నాయి. డాక్టర్‌తోపాటు సిబ్బంది ఆస్పత్రికి వచ్చే రైతులు కనీసం నిల్చునే పరిస్థితి లేదు. ఈ ప్రాంతరైతులు పాల ఉత్పత్తికి ప్రసిద్ధి. నల్లజాతి పశువులు (గేదెలు) వేలాదిగా పరిసర గ్రామాల్లో ఉన్నాయి. జాతికోళ్ల పెంపకం ఈ ప్రాంతంలో అధికంగా ఉంటుంది. ఈ భవన సమూదాయానికి ఉన్న గేటు సైతం కొన్నేళ్ల క్రితం శిథిలమైంది. ప్రభుత్వం సత్వరమే స్పందించి నూతన బిల్డింగ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి



ఈ ప్రాంతంలో గేదెల పెంపకం ఎక్కువగా ఉంటుంది. ప్రతినిత్యం పశువుల వైద్యం కోసం రైతులు పశువైద్యశాలకు వెళ్తుంటారు. అధికారులు సత్వర చర్యలు తీసుకుని నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి.

– మామిళ్ళపల్లి లక్ష్మణరావు, రైతు, ఎర్రగుంట

ప్రతిపాదనలు పంపించాం



భవన సమూదాయం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. కొంత ఇబ్బందికరంగా మారింది. నూతన భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం ఆమోదించగానే చర్యలు చేపడుతాం.

– డాక్టర్ సీహెచ్ బుచ్చిబాబు, పశువైద్యాధికారి, ఎర్రగుంట

క్లుప్తంగా

పోలీసుల తనిఖీ

చర్ల: చర్ల మండల శివారు గ్రామాల్లో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రమైన చర్లలో ఆదివారం జరిగే వారపు సంతకు సరిహద్దున ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా, బీజాపూర్, దంతెవాడ జిల్లాల్లోని అటవీ ప్రాంత గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలివస్తుండగా వారి మాటున మావోయిస్టులు, మిలీషియా సభ్యులు, కొరియర్లు, సానుభూతిపరులు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను చేపట్టారు. తనిఖీల్లో భాగంగా మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు, లెనిన్‌కాలనీ, దానవాయిపేట తదితర ప్రాంతాల్లో మోహరించిన సివిల్, స్పెషల్ పార్టీ పోలీసులు తనిఖీలను కొనసాగించారు. సీఐ రాజువర్మ ఆదేశాల మేరకు ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్‌లు తనిఖీలను నిర్వహించారు.

అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలి

పినపాక: అసాంఘిక శక్తులకు దూరంగా ఉండి, ప్రభుత్వానికి సహకరించాలని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని పిట్టతోగు, ఉమేష్ చంద్ర నగర్ వలస ఆదివాసి గ్రామాల్లో పర్యటించిన వారు గ్రామస్తులతో మాట్లాడి.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యువతకు వాలీబాల్ కిట్లు, పెన్నులు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ప్రతి ఒక్క ఆదివాసీ ఉపాధి చేసుకుంటూ అభివృద్ధి చెందాలని సూచించారు. ఆదివాసీ గ్రామాల్లో విద్య, వైద్యం, రవాణా సౌకర్యాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సై సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ముహూర్తం ఖరారు

దుమ్ముగూడెం: లక్ష్మీనగరం గ్రామంలో ప్రతీ రెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే గ్రామ దేవతల జాతరకు గ్రామస్తులు ముహూర్తం ఖరారు చేశారు. ఆదివారం జరిగిన సమావేశంలో జాతర నిర్వహణకు తేదీలను ఖరారు చేసి జాతర నిర్వహణ కమిటీని ఎన్నుకున్నారు. 13వ తేదీ ఆదివారం మరిడమ్మ జాతర, 15వ తేదీన మంగళవారం పోలేరమ్మ జాతర, 22వ తేదీన మంగళవారం ముత్యాలమ్మ జాతరను నిర్వహించనున్నారు. జాతర నిర్వహణ అధ్యక్షుడిగా గుడ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా దల్లి హరిబాబు, సెక్రటరీగా గోసుల వెంకటేశ్వరరావుతోపాటు సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం జాతరలో భాగంగా గుడ్ల త్రివేణి ఇంటి వద్ద అధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్ రెడ్డి కమిటీకి పసుపు కుంకుమ జాకెట్‌లను పళ్లెంలో పెట్టి ఇచ్చారు. జరిగింది. కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

మణుగూరురూరల్: దేశ స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్త బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సంఘ కార్యాలయంలో నిర్వహించారు. తొలుత ఎమ్మార్పీఎస్ నాయకులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాబు జగ్జీవన్ రామ్ దేశానికి, దళిత బహుజనుల సమస్యల పరిష్కారం కోసం చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు పాడుతూరి కల్యాణ్‌బాబు, నాయకులు ఉసికల కొండయ్య, బి.వెంకటేశ్వర్లు, పాడుతూరి రవి, మంద కృష్ణ, కాజీపేట కృష్ణ, సుంకనపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి

దుమ్ముగూడెం: లక్ష్మీనగరం గ్రామంలోని ఏకలవ్య మోడల్ స్కూల్‌లో నెలకొన్న సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఏఎస్పీ డివిజన్ అధ్యక్షుడు మల్లూరు, పేరెంట్స్ కమిటీ డిమాండ్ చేశారు. ఆదివారం పాఠశాలను సందర్శించిన పేరెంట్స్ కమిటీ, ఆదివాసీ నాయకులు విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వారి ముందుంచారు. వారం రోజుల నుంచి నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని అలాగే మరుగుదొడ్లు సరైనవి లేక బహిర్భూమికి బయటకు వెళ్లాల్సి వస్తుందని వారి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మల్లూరు మాట్లాడుతూ.. సరైన సౌకర్యాలు కల్పించకుండా ఇంకా ఎన్నాళ్లు పాఠశాల కొనసాగిస్తారని ప్రశ్నించారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కారం గోపాల్, వర్స ముదరాజ్, కుంజ నాగేశ్వరరావు, ఆప్కా నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

దుమ్ముగూడెం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని మండలంలోని గ్రామగ్రామానా నిర్వహించాలని ఆదివాసీ ఐక్య కార్య చరణ కమిటీ అధ్యక్షుడు కొమరం దామోదర్ రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా ప్రచారం ప్రారంభించారు. మాట్లాడుతూ.. ఆగస్టు 9న జరగబోయే ప్రపంచ ఆదివాసి దినోత్సవం జయప్రదం చేయడానికి ఆదివాసీలు సన్నద్ధం అవ్వాలని అన్నారు. కార్యక్రమంలో ఆదివాసి పెద్దలు కుంజ శ్రీనివాస్ రావు, తెల్లం హరికృష్ణ, తెల్లం భీమరాజు, కారం నవీన్, కంగల్ భద్రయ్య,తెల్లం సమ్మయ్య, తెల్లం రమేష్, పోడియం రామారావు, ఏనిక ఆదయ్య, పోడియం రామారావు, సవలం భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

జి. శ్రీనివాస్, ACM - 70754 60585 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం ఎస్. లక్ష్మయ్య - 80742 70476
పినపాక ఎస్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎస్.దుర్గారాంప్రసాద్-9000327175. టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

యస్.రవిబాబు - 99516 02914
ఎన్. జయరాజు - 9652868642
కె. మధు - 97059 44416